## నక్కపల్లి లో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలు - నివాళులర్పించిన వీసం

**నక్కపల్లి, పెన్ సత్తా, జులై 06:** మండల కేంద్రం నక్కపల్లి లో బాబు జగ్జీవన్ రావ్ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం స్థానిక ఎస్సీ కాలనీలో జాతీయ రహదారిని అనుకుని ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సందర్భంగా వీసం మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ సేవలు ఎనలేనివి అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన్ని స్మరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు గొర్ల గోవింద్, మాజీ ఉప సర్పంచ్ వీసం రాజు,తల్లా భార్గవ్, సతీష్ జగ్జీవన్ రామ్ యూత్ సభ్యులు పాల్గొని ఆయనకు నివాళులర్పించారు.



# జీవో 396 రద్దు చేయాలి





- దస్తావేజు లేఖరులు రెండు రోజులు పెన్ డౌన్
- వై సి పి సంగీభావం
- జీవో 396కు వ్యతిరేకంగా లేకర్ల నిరసన.

**నక్కపల్లి, పెన్ సత్తా,జులై 06:** రిజిస్టర్ కార్యాలయాలను ప్రైవేటీకరణ చేస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 396 ను రద్దు చేయాలంటూ నక్కపల్లి సబ్ రిజిస్టార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరులు పెన్ డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం తమ విధులను బహిష్కరించి జీవో నెంబర్ 396 ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని నిరసన తెలుపుతూ పెన్ డౌన్ చేపట్టారు. లేఖర్ల నిరసన కార్యక్రమానికి సంఘీభావంగా వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో వైసిపి శ్రేణులు నిరసన కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వీసం రామకృష్ణ మాట్లాడితూ పిపిపి విధానంలో సేవా కేంద్రాలు ఏర్పాటు చేయడం వలన దస్తావేజు లేఖరుల వృత్తిని కోల్పోయి వీధిని పడతారన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఇటువంటి నిర్ణయాల వల్ల లేకర్ల భవిష్యత్తు అగమ్య గోచరంగా తయారవుతుందని తెలిపారు. వృత్తి భద్రతకు దస్తావేజు లేఖర్లకు లైసెన్సులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వీసం నానాజీ, వైయస్సార్సీపి మండల అధ్యక్షుడు గొర్ల గోవిందు, వీసం శ్రీను, జిల్లా కార్యదర్శి సీరం నరసింహమూర్తి, గొడుగుల బంగారాజు, దస్తావైజులేఖరుల నక్కపల్లి సబ్ రిజిస్టార్ ఆఫీస్ గౌరవాధ్యక్షుడు కొంగరచిన కృష్ణమూర్తి, అధ్యక్షుడు దాతారం మురళీకృష్ణ, రాంబాబు, సూర్యనారాయణ, నూకరాజు, గోవిందు, లోకేష్, ఉపేంద్ర, లోవరత్నం, చిరంజీవి , త్రినాథ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సీపట్నంలో డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్.



రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ధర్నా



**నర్సీపట్నం, పెన్ సత్తా, జులై 06:** రిజిస్ట్రేషన్ దస్తా వేజు లేఖరులు సోమవారం పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించి స్థానిక సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రైవేట్ రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేసే నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేటుపరం చేయకుండా ప్రభుత్వమే కొనసాగించాలని, డాక్యు మెంట్ రైటర్ల అధ్యక్షులు సున్నం చితంభరం స్వామి ఆధ్వర్యంలో డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయం వద్ద నిరసన చేపట్టి, డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆస్తుల భద్రత, హక్కుల పరి రక్షణ ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటూ, రిజిస్ట్రేషన్ వ్యవస్థను ప్రైవేట్ చేతుల్లోకి ఇవ్వడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్ల పై సానుకూలంగా స్పందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డాక్యుమెంట్ రైటర్లు అధ్యక్షులు సున్నం చిదంబరం స్వామి, ఉపా ధ్యక్షులు ఎం సత్తిబాబు, కార్యదర్శి శివకుమార్, వాణి, నరం సన్యాసి నాయుడు, పలువురు డాక్యుమెంటరీ పాల్గొన్నారు.

## కూటమి నాయకులు ఆధ్వర్యంలో రైతులకు వరి విత్తనాలు పంపిణీ.

**నక్కపలి పెన్ సత్తా,జూలై 06:**రాష్ట్ర హోమ్ మినిస్టర్ ఆదేశాలమేరకు పాయకరావుపేట నియోజవర్గనియోజకవర్గ కన్వీనర్ కోప్పిశెట్టి వెంకటేష్ సూచనలు మేరకు నక్కపల్లి రైతు భరోసా కేంద్రంలో రైతులకు వరి విత్తనాలు కూటమి నాయకుల ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి కోసూరు శ్రీనివాసరావు, నక్కపల్లి టిడిపి టౌన్ ప్రెసిడెంట్ అడ్డూరి లోవరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ఎప్పుడు అండగా ఉంటుందని మన ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఈ మధ్యకాలంలోనే అన్నదాత సుఖీభవ రైతులకు వేయడం జరిగింది అని చెప్పడం జరిగింది వరి విత్తనాల పంపిణీ చేయడం వల్ల రైతులు హర్షం చేశారు ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు పోల్నాటి నానాజీ, మీగడ సత్తిబాబు, కె.వి. సత్యనారాయణ, కొప్పిశెట్టి వీరబాబు, మాజీ సర్పంచ్ మీసాల ఉమామహేశ్వరరావు, అడ్డూరి నాగభూషణం, కోసూరు శ్రీనివాసరావు,, పచ్చిపులుసు నాగేశ్వరరావు, కొల్నాటి వెంకటరమణ, దేవరపు లోవరాజు, సచివాల సిబ్బంది గాయత్రి, పాల్గొన్నారు.



## రాజపురం బాలుర బీసీ హాస్టల్ లో వసతులు శూన్యం.




వైయస్సార్సీపి నియోజకవర్గ సమన్వయకర్త శ్యాం ప్రసాద్ రెడ్డి



**కవిటి పెన్ సత్తా,జూలై 06:** మండలంలోని రాజపురం బాలుర బీసీ హాస్టల్ లో వసతులు ఘోరంగా ఉన్నాయని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైయస్సార్సీపి సమన్వయకర్త సాడి.శ్యాం ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.త్రాగునీరు కొరకు ఏర్పాటు చేసిన ఆర్ ఓ సిస్టమ్ పనిచేయడం లేదని, నైట్ వాచ్ మాన్అసలులేరని,చదువుకునేందుకు సరిపడా లైటింగ్ లేదు,ఫుల్ టైమ్ వార్డెన్ లేరు,టాయిలెట్స్ దారుణంగా ఉన్నాయి విద్యార్థులు బయటకు వెళ్ళాలి,స్టడీ అవర్ కు ట్యూటర్ లేరు,మరి విద్యార్థులు ఎలా చదువుతారని,భోజనం అసలు బాగోలేదని స్వయంగా నేను తిన్నాను అని ఆయన పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యేని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కనీస సౌకర్యాలు లేని ఈ హాస్టల్లో మీరు వచ్చి ఒకరోజు ఇక్కడ నిద్రించాలని ఆయన సవాల్ విసిరారు.ఇంత దారుణంగా ఉన్న ఈ హాస్టల్లో విద్యార్థులు ఎలా చదువుతారని దీనిపై త్వరలో కలెక్టర్ వారిని కలిసి ఈ సమస్య వివరించనున్నానని పేర్కొన్నారు.

## కొబ్బరి తోటల ఉత్పాదకపై రైతులకు అవగాహన.

- ఉద్యాన శాఖ అధికారిని పోలాకి.మాధవి లత



**పెన్ సత్తా,జూలై 06:**:కొబ్బరి తోటల్లో అధిక దిగుబడి సాధించేందుకు ప్రభుత్వం మరియు కొబ్బరి అభివృద్ధి బోర్డు సంయుక్తంగా అమలు చేస్తున్న ఉత్పాదక పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.బారువలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారినిపోలాకి.మాధవి లత ఆధ్వర్యంలో పథకం వివరాలు రైతులకు వివరించారు.రైతులు ప్రస్తుతం ఒక కొబ్బరి చెట్టు నుండి 60 కొబ్బరికాయలు వస్తున్నందున వలన అది 100 కొబ్బరికాయలకు పెంచడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. రైతులకు 100% రాయితీపై రూ.21 వేలు విలువైన ఇన్పుట్ సబ్సిడీ ప్యాకేజీని అందజేయమైనట్టు తెలిపారు.ఈ కిట్లో వేప పిండి, వేపనూనె,హెక్సోకోనోజోల్, పీఎండీఎస్ వంటి ఉత్పత్తులు ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు ఈ పథకాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాలని కొబ్బరి తోటల్లో కొబ్బరి ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూరాడ. చంద్రమోహన్,మద్దు.కుమార్,దున్న.సత్యం,రైతులు మరియు అధికారులు పాల్గొన్నారు.

## దస్తావేజు లేఖరుల పెన్డౌన్.
## జీవో 396కు వ్యతిరేకంగా నిరసన.



**పెన్ సత్తా,జూలై 06:**నక్కపల్లి సబ్ రిజిస్టార్ కార్యాలయం వద్ద దస్తావేజులేఖరుల పెన్డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం తమ విధులను బహిష్కరించి జీవో నెంబర్ 396 ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ నిరసన తెలుపుతూ పెన్ డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిపిపి విధానంలో సేవా కేంద్రాలు ఏర్పాటు చేయడం వలన దస్తావేజు లేఖరులు తమ వృత్తిని కోల్పోయి వీధిని పడతారని వారి భవిష్యత్తు అగమ్య గోచరంగా తయారవుతుందని సోమ మంగళవారాల్లో ఈ పెన్డౌన్ తో నిరసన తెలియజేస్తున్నట్లు తెలిపారు. వృత్తి భద్రత కోసం లైసెన్సులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లేఖర్లకు మద్దతు తెలిపింది. రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ మాట్లాడుతూ జీవో నెంబర్ 396 వల్ల దస్తావేజు లేఖర్లు వృత్తిని కోల్పోయి వీధిన పడతారని తక్షణం జీవో నెంబర్ 396 ను ఉప సంహరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మీసం నానాజీ, వైయస్సార్సీపి మండల అధ్యక్షుడు గొర్ల గోవిందు, వీసం శ్రీను, జిల్లా కార్యదర్శి సీరం నరసింహమూర్తి, గొడుగుల బంగార్రాజు, దస్తావైజులేఖరుల నక్కపల్లి సబ్ రిజిస్టార్ ఆఫీస్ గౌరవాధ్యక్షుడు కొంగరచిన కృష్ణమూర్తి, అధ్యక్షుడు దాతారం మురళీకృష్ణ, రాంబాబు,సూర్యనారాయణ, నూకరాజు, గోవిందు, లోకేష్, ఉపేంద్ర, లోవరత్నం, చిరంజీవి , త్రినాధ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## లైన్ మెన్ కూర్మారావు సేవలు మరువలేనివి.

- ఆయన ఆకాలమరణం బాధించింది: విద్యుత్ ఉద్యోగులు.



**పెన్ సత్తా,జూలై 06:**:ఇచ్ఛాపురం సబ్ స్టేషన్లో షిఫ్ట్ లైనమన్ గా పనిచేస్తున్న దుద్ది.కూర్మారావు(లైన్ మెన్) అకాలమరణం చెందినందువలన వారి కుటుంబ సభ్యులకు దహన సంస్కార ఖర్చుల నిమిత్తం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు డిస్కం కార్యదర్శి గణపతి.వి.యస్.ఆర్.కె ఆదేశాల మేరకు స్టేట్ యూనిట్ నుండి రూ20000 వేలు,మరియు డిస్కం యూనిట్ నుండి రూ30000 వేలు,మొత్తం రూ50000వేలు చెక్కును మృతిని కుటుంబ సభ్యులకు ఏ.పి.ఇ.ఇ. యూనియన్-1104 తరుపున అందజేసి,దుద్ది. కూర్మారావ్ నివాళులు అర్పించి,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ప్రాంతీయ కార్యదర్శి మరియు టెక్కలి డివిజనల్ కార్యదర్శి యన్.లోకేశ్వరరావు,పలాస బ్రాంచ్ ప్రెసిడెంట్ కొమ్మల. గిరీష్ రావు మరియు సెక్రటరీ గార.రాజారావు,రాష్ట్రకార్యవర్గ సభ్యులు మరియ టెక్కలి డివిజనల్ అధ్యక్షులు దాసరి. శేఖర్,మరియు వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాదరావు పాణిగ్రహి,డివిజనల్ మరియు పలాస ఆర్గనైజేషన్ సెక్రటరీ పొందర.రామచంద్ర రావు టెక్కలి వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్ రత్నం కార్యనిర్వాహక కార్యదర్శి ఇ.ఈశ్వర రావు,ట్రెజరర్ మెట్ట.హిమగిరి మరియు డి. హర్షవర్ధన్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
ప్రశ్నించడం అందరి హక్కు..
PEN SATTA Telugu Daily



# పెద్దన్న పట్టుజారుతోందా?


రెండో ప్రపంచ యుద్ధం ముగిసినప్పటి నుంచి అమెరికా, పశ్చిమ యూరప్ దేశాల ఆధిపత్యం ప్రపంచ వ్యవహారాల్లో అత్యంత సహజ సత్యంగా చలామణి అవుతూ వచ్చింది. సైనిక శక్తి, సాంకేతిక ఆవిష్కరణలు, ఆర్థిక పటిష్టతల ఆధారంగా ఏర్పడిన ఆధిపత్యం దశాబ్దాలుగా సవాలు లేకుండా సాగుతోంది. అయితే చైనా ఎదుగుదల, కీలక వ్యూహాత్మక వనరులపై దాని పట్టు, మధ్యస్థాయి శక్తుల ప్రాబల్యం క్రమంగా అమెరికా అగ్రరాజ్య ప్రతిష్టను దెబ్బతీయడం మొదలుపెట్టాయి. పశ్చిమ నాయకత్వానికి సమర్థవంతమైన సవాలు ఎదురుకావడానికి ఇంకా సమయం ఉందని చాలామంది నిపుణులు నమ్మారు. అమెరికా నిర్మాణాత్మక బలహీనతలపై ఆందోళనలు పెరుగుతున్నా, ఇరాన్‌వంటి దేశం అమెరికా ప్రతిష్టకు ఇంతటి తీవ్ర, ప్రాణాంతక దెబ్బ తగిలిస్తుందని ఎవరూ ఊహించలేదు. మృతిచెందిన ఇరాన్ అత్యున్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ ఒకసారి అమెరికన్లు నిరంతరం యుద్ధ బెదిరింపులు చేస్తారుగానీ.. వారికి "నిలబడే శక్తి" ఉండదని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఆ మాటలు యథార్థమేనని రుజువవుతోంది. 1980-88నాటి ఇరాన్-ఇరాక్ యుద్ధ కాలంలో ఇరాన్ ఇస్లామిక్ పాలనా వ్యవస్థ ప్రదర్శించిన అసాధారణ సహనం, తట్టుకునే శక్తి, తన పాలనను కాపాడుకోవాలన్న పట్టుదల- ఇప్పటికీ కొనసాగుతోందని ఇటీవలి పరిణామాలు చాటిచెప్పాయి. ఈ కోణాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గుర్తించకపోవడం.. భారీ మూల్యం చెల్లించేలా చేసింది. స్విట్జర్లాండ్‌లో అన్ని వివాదాస్పద అంశాలపై సమగ్ర చర్చలు మొదలుపెట్టకముందే, యుద్ధాన్ని ముగించి హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు అమెరికా, ఇరాన్ గడచిన జూన్ మధ్యలో ఒక "ప్రాథమిక ఒప్పందా"నికి వచ్చాయి. అధికారిక చర్చలకు ముందు, జూన్ 17న ఫ్రాన్స్‌లోని వర్సైల్స్ రాజప్రాసాదంలో ట్రంప్ సంతకం చేసిన 14 అంశాల అవగాహన ఒప్పందం (ఎంవోయూ), మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీపై అవమానకరమైన షరతులు విధించిన 1919 నాటి వర్సైల్స్ ఒప్పందంతో పోలికలకు దారితీసింది. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు ముందున్న యథాతథ స్థితినే ఈ ఒప్పందం తిరిగి ధ్రువీకరిస్తోందని విస్తృత విమర్శలు వచ్చాయి. హర్మూజ్ జలసంధి పునఃప్రారంభం, అమెరికా దిగ్బంధనం ఎత్తివేత, ఇరాన్ పునర్నిర్మాణం కోసం కనీసం 300 బిలియన్ డాలర్ల ప్రణాళికకు అస్పష్ట కట్టుబాటు వంటివి ఇందులో ఉన్నాయి. అయితే అమెరికా నిధులు నేరుగా ఇరాన్‌కు వెళ్లబోవని అమెరికా స్పష్టం చేసింది కాబట్టి, ఈ కట్టుబాటు స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తుల విడుదలకే పరిమితమయ్యే అవకాశం ఉంది. అణ్వాయుధం అభివృద్ధి చేయబోమన్న ఇరాన్ హామీ కూడా ఇందులో ఉన్నట్టు తెలుస్తోంది. స్విట్జర్లాండ్ చర్చలు లాంఛనప్రాయంగానే ముగిశాయని, అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) తనిఖీ బృందాలను తిరిగి అనుమతించేలా తెహ్రాన్‌ను ఒప్పించి తాము కీలక మైలురాయిని సాధించామని అమెరికా ప్రకటించింది. అయితే అణు తనిఖీలపై తాము "కొత్త కట్టుబాట్లేవీ" చేయలేదని ఇరాన్ తన రాజ్య మీడియాకు తెలిపింది. ఈ ముగింపు అమెరికాకు "తీవ్రంగా అవసరమైన కాల్పుల విరమణ"గా చాలామంది పరిశీలకులు అభివర్ణించారు. ఎందుకంటే వెంటనే అమెరికా ఇరాన్‌పై చమురు ఆంక్షలు ఎత్తివేసి, 60 రోజుల మినహాయింపు జారీ చేసింది. ప్రపంచవ్యాప్తంగా వార్తాపత్రికలు ఈ ఒప్పందంపై కాకుండా, అమెరికా ప్రతిష్టకు వాటిల్లిన నష్ట తీవ్రతపైనే ఎక్కువగా దృష్టి పెట్టాయి. "వర్సైల్స్-2: చరిత్రకారులు సైతం అడుగుపెట్టేందుకు జంకేచోట ట్రంప్ చొరవ" అంటూ ఒక ప్రముఖ పత్రిక వేసిన శీర్షిక దీనికి అద్దం పడుతుంది. వాస్తవానికి ఈ ఒప్పందంవల్ల అమెరికాకు గణనీయమైన ప్రయోజనమేమీ దక్కలేదు. చమురు ఆంక్షల సడలింపు, హర్మూజ్ జలసంధి రవాణా వ్యవహారాల్లో ఇరాన్‌కు అధికారిక పాత్ర, భవిష్యత్‌లో రవాణా రుసుములు వసూలు చేసే అవకాశం వంటివి ఒప్పందంలో భాగంగా ఉన్నాయి. అయితే నౌకల భద్రత, రక్షణ చర్యలు, అత్యవసర సహాయ వ్యవస్థలపై ఇప్పటికీ స్పష్టత లేదు. ప్రపంచంలోనే అగ్రగామి అణుశక్తి అయిన అమెరికా, యుద్ధంలో బాగా దెబ్బతిన్న ఇరాన్‌కు తలవంచిన వైనమే పెద్ద చర్చకు దారితీసింది. ఇరాన్‌ను నిర్వీర్యం చేసి, పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ నిర్వివాద ఆధిపత్యాన్ని స్థాపించాలన్న ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కుటిల వ్యూహం ఇప్పుడు చరిత్రలో అవశేషమైంది.

## సంపాదకీయం

ఖమేనీ మరణించి, 1989 నుంచి పాలించిన ఆయన స్థానంలో వచ్చిన నాయకత్వాన్ని పటిష్టం చేసుకునేందుకు ఇరాన్ ప్రభుత్వం జూలై 4 నుంచి 9 వరకూ బహుళ దినాల అంత్యక్రియలను నిర్వహిస్తోంది. తెహ్రాన్, ఖోమ్, మషాద్‌లతోపాటు ఇరాక్‌లోని నజఫ్, కర్బలాల మధ్య విస్తరించిన ఈ కార్యక్రమాలకు తెహ్రాన్ ఒక్కదానిలోనే 1.5-2 కోట్లమంది హాజరవుతారని ఇరాన్ అధికారులు అంచనా వేస్తున్నారు. భారీ జనసందోహాన్ని ప్రదర్శించడం ద్వారా, తమ నాయకుడి హత్యకు కారకులైన శక్తులకే తమ పాలనా వ్యవస్థ మనుగడను చాటిచెప్పాలన్నది ఇరాన్ వ్యూహంగా కనిపిస్తోంది. ఇదే సమయంలో హర్మూజ్ జలసంధిపై తన పట్టును సంధాన సాధనంగా ఉపయోగించుకునేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోంది.

ఖతార్ మధ్యవర్తిత్వంలో పరోక్ష చర్చలు "సానుకూల పురోగతి" సాధిస్తున్నా, ఖమేనీ అంత్యక్రియల నేపథ్యంలో తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఇరాన్‌లో అయతొల్లాల కంటే ఇప్పటికే పైచేయి సాధిస్తున్న ఐఆర్‌జీసీ, కొత్త నాయకుడితో మరింత నిర్భయంగా వ్యవహరించే అవకాశముంది. దీని ప్రభావం భారత్ సహా అధిక షియా జనాభా ఉన్న దేశాల్లోనూ షియా-సున్నీ ఉద్రిక్తతలను తీవ్రతరం చేసే ప్రమాదముంది. ఇజ్రాయెల్ సైతం "గాయపడిన పులిలా" వ్యవహరించే అవకాశం ఉంది. అమెరికాతో బంధం సన్నగిల్లుతున్న సూచనలతో, ఇజ్రాయెల్ అరబ్ పొరుగు దేశాలతో కొత్త "సాహసోపేత" చర్యలకు దిగే అవకాశం ఉందని విశ్లేషకుల అంచనా. ఇది అబ్రహామ్ ఒప్పందాల నుంచి ఏర్పడిన బలహీన శాంతిని మరింత దెబ్బతీయవచ్చు. అమెరికా ప్రభావం క్షీణించనుండటంతో, గల్ఫ్ దేశాలు తమ భద్రత కోసం అమెరికాపై ఆధారపడటాన్ని పునఃసమీక్షించుకునే అవకాశం ఉంది; పశ్చిమాసియాలో అమెరికా సైనిక ఉనికిని తగ్గించాలన్న డిమాండ్లు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. రష్యా, చైనాలు ఈ సంఘర్షణ నుంచి పెద్దగా ప్రయోజనం పొందలేదు గానీ, ఈ స్థాయి అనిశ్చితి అల్‌ఖైదా వంటి తీవ్రవాద సంస్థల పునరుజ్జీవానికి దోహదపడే ప్రమాదం ఉందని భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## పనికొచ్చే పలుకు



# ఏది నాటితే.. అదే మొలుస్తుంది!

"మీరు మనసులో ఏది నింపితే, అదే మీకు ఖచ్చితంగా తిరిగి వస్తుంది" అంటాడు ప్రసిద్ధ రచయిత జేమ్స్ జాయిస్. మన ఆలోచనల్లో సానుకూలత, జ్ఞానం, స్పష్టమైన లక్ష్యాలను నింపుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం, పట్టుదల, విజయాన్ని సొంతం చేసుకోవచ్చన్నది ఆయన మాటల్లోని అనుభవపూర్వక పాఠం. క్రమశిక్షణ, ఆశాజనకమైన ఆలోచనా విధానమే వ్యక్తిగత ఎదుగుదలకు, విజయానికి బలమైన పునాదిగా మారుతుంది. ఒక అద్దం మనం చూపే భావాన్నే ప్రతిబింబిస్తుంది. మానవ మేధస్సు కూడా అంతే. దానికి మనం నిరంతరం అందించే సమాచారాన్నే అది తిరిగి ప్రతిఫలిస్తుంది. సవాళ్లు ఎదురైనప్పటికీ ఆశావాదం, నిరంతర అభ్యాసం, స్వీయ క్రమశిక్షణను ఎంచుకోవడం ద్వారా సంతృప్తికరమైన జీవితాన్ని నిర్మించుకోవచ్చు. సానుకూల ఆలోచనలు, నిరంతర అభ్యాసం మన వ్యక్తిత్వాన్ని, నిర్ణయాలను, భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి. అదే సమయంలో ప్రతికూల ఆలోచనలు మనకు అడ్డంకులను, పరిమితులను సృష్టిస్తాయి.

మన మనసు ఒక ప్రవహించే నదిలాంటిదని ఈ సూక్తి మనకు నేర్పుతుంది. ఆ నదిలో మనం ఏ నీటిని కలిపితే, అదే రంగులో అది ముందుకు సాగుతుంది. భయం, ప్రతికూలత, కోపం, లేదా ఆత్మన్యూనతా భావాలను మనసులో నింపితే, అవి మన భావోద్వేగాలను, పనులను శాసిస్తాయి. మరోవైపు సానుకూల ఆలోచనలు, ఉపయోగకరమైన జ్ఞానం, సృజనాత్మకత, ఆశావహ దృక్పథాన్ని మనసుకు అందిస్తే, మనం మరింత ఆత్మవిశ్వాసంతో క్లిష్ట పరిస్థితులను సైతం అధిగమించగలుగుతాం. మన మానసిక అలవాట్లకు మనమే బాధ్యత వహించాలని ఈ మాటల పాఠం. ఎందుకంటే విజయం, సంతోషం అనేవి మన ఆలోచనా విధానం నుంచే మొదలవుతాయి. మనం చదివే ప్రతి పుస్తకం, మనం జరిపే ప్రతి సంభాషణ, మనలో మెదిలే ప్రతి ఆలోచన మన వ్యక్తిత్వ రూపాంతరానికి దోహదం చేస్తాయి.

నిత్య జీవితంలో దీని ప్రాధాన్యత

నిత్య జీవితంలో ప్రతి ఒక్కరూ తమ ఆలోచనల ప్రభావాన్ని అనుభవిస్తూనే ఉంటారు. తమపై నమ్మకం ఉన్న విద్యార్థులు మరింత ఆత్మవిశ్వాసంతో చదువుతారు. ఉద్యోగులు సానుకూల వైఖరితో మెరుగ్గా రాణిస్తారు. కష్టాల్లో ఉన్నవారు ఆశావహ దృక్పథంతో మరింత బలంగా తయారవుతారు. ప్రస్తుత సోషల్ మీడియా యుగంలో సమాచారం విపరీతంగా అందుబాటులో ఉంటోంది. ఇలాంటి సమయంలో మన మనసులోకి ఎలాంటి విషయాలను రానివ్వాలో జాగ్రత్తగా ఎంచుకోవాలని ఈ సూక్తి గుర్తుచేస్తుంది. ప్రతికూల ఆలోచనల స్థానంలో ఆశావాదాన్ని, నిరంతర అభ్యాసాన్ని అలవర్చుకోవడం వల్ల ఏ వయసు వారైనా, ఏ వృత్తిలో ఉన్నవారైనా ప్రయోజనం పొందుతారు.

అందుకే స్ఫూర్తినిచ్చే పుస్తకాలు చదవాలి. కొత్త నైపుణ్యాలు సాధన చేయాలి. మనకు మద్దతుగా నిలిచే వ్యక్తులతోనే సమయం గడపాలి. సమస్యలపైనే దృష్టి పెట్టకుండా, ఉన్నదానిని అభినందిస్తూ కృతజ్ఞతా భావాన్ని అలవర్చుకోవాలి. మనల్ని మనం తక్కువ చేసుకునే ఆలోచనల స్థానంలో ప్రోత్సహించే ఆలోచనలను పెంచుకోవాలి. జీవితంలో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. నిత్యం ధ్యానం లేదా ఆత్మపరిశీలన చేసుకోవడం ద్వారా నిరంతర అభ్యాసాన్ని కొనసాగించాలి.

# కృత్రిమ బుడగ పేలిపోతే..?


ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ దిగ్గజాలు కృత్రిమ మేధ (ఏఐ) మౌలిక సదుపాయాల కోసం కుమ్మరిస్తున్న పెట్టుబడులు ఇప్పుడు చరిత్రలోనే అత్యంత భారీస్థాయికి చేరుకున్నాయి. గత ఏడాది సుమారు 400 బిలియన్ డాలర్లుగా ఉన్న బడా టెక్ కంపెనీల ఏఐ మూలధన వ్యయం.. ఈ ఏడాది 700 బిలియన్ డాలర్లను దాటనుంది. మైక్రోసాఫ్ట్, మెటా, గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్, అమెజాన్, ఒరాకిల్ వంటి కంపెనీలు కలిసి 2025లో సుమారు 365 బిలియన్ డాలర్లనుంచి 2026లో దాదాపు రెట్టింపుస్థాయికి తమ ఏఐ వ్యయాలను పెంచుకున్నాయి. అమెజాన్ ఒక్కటే 200 బిలియన్ డాలర్లు వెచ్చించనుండగా, ఆల్ఫాబెట్ తన అంచనాను 90 బిలియన్ల నుంచి ఏకంగా 175-185 బిలియన్ డాలర్లకు రెట్టింపు చేసింది. మెటా సైతం తన మూలధన వ్యయ లక్ష్యాన్ని 135 బిలియన్ డాలర్ల వరకూ పెంచుకుంది. ఈ గణాంకాలు కొన్ని దేశాల మొత్తం జీడీపీని మించిపోతుండటం గమనార్హం. కానీ ఇంత భారీ వ్యయానికి తగ్గ ఆదాయం ఏఐ కంపెనీలకు ఇంకా అందడం లేదన్నది నిపుణుల ఆందోళన. ఖర్చులు పెరిగే కొద్దీ నగదు నిల్వలపై ఒత్తిడి తీవ్రమవుతోంది. మెటావంటి కంపెనీల విషయంలో వచ్చే రెండేళ్లలో నికర నగదు ప్రవాహం రుణాత్మకంగా మారే అవకాశముందని విశ్లేషకుల అంచనా. దీన్నిబట్టి, ఏఐ రంగంలో పెట్టుబడుల విస్ఫోటనం నిజంగా సాంకేతిక విప్లవానికి నాంది కాదా? లేక చరిత్రలోనే అతిపెద్ద మూలధన దుర్వినియోగమా? అన్న ప్రశ్న తెరమీదకు వస్తోంది. న్యూయార్క్ యూనివర్సిటీ ప్రొఫెసర్ గ్యారీ మార్కస్ వంటి నిపుణులు దీన్ని "చరిత్రలోనే అతిపెద్ద మూలధన దుర్వినియోగం"గా అభివర్ణించడం ఈ చర్చకు మరింత బలం చేకూరుస్తోంది.

ఈ నేపథ్యంలో సాంకేతిక విమర్శకుడు, రచయిత కోరీ డాక్టరో కొత్తగా వెలువరించిన "ది రివర్స్ సెంటార్స్ గైడ్ టు లైఫ్ ఆఫ్టర్ ఏఐ" పుస్తకం విస్తృత చర్చకు తెరలేపింది. గత ఏడాది ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల వినియోగదారుల అనుభవం ఎందుకు దిగజారుతోందో విశ్లేషిస్తూ ఆయన రాసిన "ఎన్‌షిటిఫికేషన్" పుస్తకం పెద్ద సంచలనమే సృష్టించింది. ఆటోమేషన్ సిద్ధాంతంలో "సెంటార్" అంటే యంత్రం సాయంతో మరింత సమర్థంగా పనిచేయగలిగే మనిషి. అంటే కంప్యూటర్ వాడే ప్రతి ఒక్కరూ ఒకవిధంగా సెంటార్లే. అయితే "రివర్స్ సెంటార్" అంటే దీనికి పూర్తి భిన్నం. యంత్రానికి సహాయకుడిగా మారిన మనిషి. చిత్రాలు, పాఠ్యాంశాలను గుర్తించి ఏఐ నమూనాలకు శిక్షణనిచ్చే తక్కువ వేతనాల కార్మికుల నుంచి మొదలుకుని, భవిష్యత్తులో యాజమాన్యాలు తమ సిబ్బందిని తగ్గించుకుని, కేవలం కొద్దిమంది సాయంతో ఏఐ చేత మెజారిటీ పని చేయించుకోవాలని కోరుకోవడం వరకూ- ఇవన్నీ రివర్స్ సెంటార్ల ఉదాహరణలేనని నిపుణులు అంటున్నారు. అసలు ఏఐ రంగంలో పెట్టుబడిదారులు ఇంతగా డబ్బు కుమ్మరించడానికి కారణం కూడా ఇదేనని, "యజమానులు తమ సగం సిబ్బందిని తొలగించి, ఆ మిగిలిన లాభాలను ఏఐ కంపెనీలు, వినియోగదారుల మధ్య పంచుకోగలిగే స్థాయికి ఏఐ అభివృద్ధి చెందుతుంది" అన్న ఆశతోనే వారు పెట్టుబడులు పెడుతున్నారని నిపుణుల లెక్క. అందుకే ఏఐ పోటీ ఒక సాధారణ రేసు కాదు, ఇదొక "మరణ యుద్ధం"గా మారిందని, చివరికి ఒకే సంస్థ గుత్తాధిపత్యం సాధించే అవకాశముందని పరిశ్రమ వర్గాల అంచనా. అయితే ఏ కంపెనీ చివరకు అగ్రస్థానంలో నిలుస్తుందన్న దానిపై స్పష్టత లేకపోవడంతో, ప్రతి పెట్టుబడిదారుడూ తానే సరైన అంచనా వేశానని భావిస్తూ పోటీలో కొనసాగుతున్నారు. పెట్టుబడిదారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కోసం కంపెనీలు మరింత శక్తిమంతమైన ఏఐ నమూనాలను నిరంతరం ఆవిష్కరించాల్సి వస్తోంది. ఫలితంగా భారీ విద్యుత్, నీటి వినియోగంతో కూడిన డేటా సెంటర్ల నిర్మాణం విచక్షణారహితంగా కొనసాగుతూ, పర్యావరణంపై, స్థానిక సమాజాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని పర్యావరణ, ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.



> కృత్రిమ మేధ రంగంలో పెట్టుబడుల వరద పోటెత్తుతోంది. బడా టెక్ కంపెనీల మూలధన వ్యయం ఈ ఏడాది 700 బిలియన్ డాలర్లు దాటనుంది. గత ఏడాదితో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు స్థాయి. అయినా ఖర్చులకు తగ్గ ఆదాయం ఇంకా అందని పరిస్థితి. నిపుణులు దీన్ని "చరిత్రలోనే అతిపెద్ద మూలధన దుర్వినియోగం"గా అభివర్ణిస్తున్నారు. యజమానులు సిబ్బందిని తగ్గించి ఏఐతో పని చేయించుకోవాలన్న ఆశే ఈ పెట్టుబడుల వెనుక అసలు కారణం. బుడగ పేలితే సామాన్యులు, పింఛనుదారులపైనే భారీ ప్రభావం పడే ప్రమాదం ఉంది.

ఏఐ ఆర్థిక నమూనాలో ఉన్న ప్రాథమిక లోపమే ఈ బుడగ చివరికి పేలిపోవడానికి కారణమవుతుందని నిపుణుల లెక్కగడుతున్నారు. గతంలో డాట్‌కామ్ బుడగ పేలకముందు, ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య పెరిగే కొద్దీ ఒక్కో వినియోగదారుడిని జోడించే వ్యయం, ఒక్కో సెషన్ ఖర్చు క్రమంగా తగ్గుతూ వచ్చింది. కానీ ఏఐ విషయంలో పరిస్థితి పూర్తి భిన్నం. ప్రతి కొత్తతరం ఏఐ నమూనాను శిక్షణ ఇవ్వడానికి, నిర్వహించడానికి అంతకుముందు కంటే మరింత ఖర్చవుతోంది. కొత్త వినియోగదారుడిని లేదా కొత్త ఫీచర్‌ను జోడించే కొద్దీ ఖర్చు తగ్గకపోగా పెరుగుతూనే ఉంటుందని విశ్లేషకుల మదింపు. ఈ పరిస్థితుల్లో ఏఐ కంపెనీలు ఏళ్ల తరబడి నష్టాల్లోనే కొనసాగుతున్నా, ఈ నష్టాలను భర్తీ చేసుకోగల స్పష్టమైన వ్యాపార నమూనా ఇప్పటికీ కనిపించడం లేదు. అయినప్పటికీ పెట్టుబడిదారులు ఎందుకు నిరంతరం డబ్బు కుమ్మరిస్తున్నారన్న ప్రశ్నకు, భవిష్యత్తులో ఏఐ ద్వారా వచ్చే భారీ లాభాల ఆశే కారణమని నిపుణుల విశ్లేషణ. ఏఐ మార్కెట్‌లో వాటాలకున్న భారీ ప్రాధాన్యతను బట్టి, ఈ బుడగ పేలినప్పుడు సాధారణ ప్రజలు, పింఛనుదారులు సహా విస్తృత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే బుడగ పేలిన తర్వాత మాత్రం.. ఏఐ సాధనాలను వాస్తవికంగా ఏ రంగాల్లో, ఎంతమేరకు ఉపయోగించుకోవచ్చో సరైన మదింపు చేసుకునే అవకాశం లభిస్తుందన్నది నిపుణుల మాట. ఏఐ సాంకేతికత పనికిరానిదని కాదు, దాని ఆచరణీయ ఉపయోగాలు ఇంకా పూర్తిగా వెలుగులోకి రాలేదన్నదే ఈ విశ్లేషణ సారాంశం. మొత్తంగా చూస్తే, ప్రస్తుత ఏఐ పెట్టుబడుల విస్ఫోటనం సాంకేతిక పురోగతికి నాంది కావచ్చు లేదా చరిత్రలో మరో భారీ ఆర్థిక తప్పిదంగా మిగిలిపోవచ్చు- కానీ ఈ రెండు అవకాశాల మధ్య నలుగుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాత్రం జాగ్రత్తగా గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది!! ■



మీరు ఇప్పుడిప్పుడే కెరీర్‌లో ముందడుగు వేస్తుంటే.. ముందుగా మీ గురించి మీకొక బలమైన నమ్మకాన్ని, అభిప్రాయాన్ని ఏర్పరుచుకోండి. మీరు ఎలాంటి వారో, ఎలాంటి వారు కాదో మీకు కచ్చితంగా తెలిసుండాలి. ఆ స్పష్టత లేకపోతే.. ఎవరో ఒకరు మీరు ఎలాంటి వారో నిర్ణయించడానికి ప్రయత్నిస్తారు. కాలక్రమేణా ఆ అబద్ధాన్నే మీరు నిజమని నమ్మడం మొదలుపెడతారు. ఇతరుల మాటలు, అభిప్రాయాలే మీ గుర్తింపుగా మారిపోతాయి. అందుకే మీ విలువలు, మీ సామర్థ్యాలు మీకు ముందే తెలిసుండటం చాలా అవసరం. అప్పుడే ఎవరు ఏమి చెప్పినా మీ అస్తిత్వం చెక్కుచెదరదు.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# యంత్ర మానవులు



చైనా టెక్ దిగ్గజం యుబెటెక్ సరికొత్త హ్యూమనాయిడ్లను ఆవిష్కరించింది. యూవరల్డ్ యు1 సిరీస్‌లో పురుష, స్త్రీ మోడళ్లు 183, 169 సెం.మీ ఎత్తుతో, మనుషులకంటే సగం బరువుతో రూపొందాయి. బయోమిమెటిక్ చర్మం, మానవ కదలికలను 90 శాతం పునఃసృష్టించే మెడ నిర్మాణం వీటి ప్రత్యేకతలు. కేవలం 20 మిల్లీసెకన్లలోపే మాటలకు, పెదవుల కదలికలకు సమన్వయం సాధించే ఫేషియల్ యాక్చుయేషన్ వ్యవస్థ, 20కి పైగా భావోద్వేగాలను 90శాతం కచ్చితత్వంతో గుర్తించే ఏఐ మెదడు వీటిలో ఉన్నాయి. తోడుగా ఉండటం, వృద్ధుల సంరక్షణ, హాస్పిటాలిటీ, పరిశోధనవంటి రంగాల్లో వినియోగానికి ఇవి ఉపయోగపడతాయని కంపెనీ తెలిపింది. ఇప్పటికే 10,000కు పైగా ఆర్డర్లు రాగా, ధర 17,000 డాలర్ల నుంచి 1,45,000 డాలర్ల వరకూ ఉంది. సెప్టెంబర్‌లో తొలి డెలివరీలు జరగనున్నాయట.

